క్లుప్తంగా

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు

నాగార్జునసాగర్ : పాలిటెక్నిక్ కళాశాల నాగార్జునసాగర్‌లో చేరేందుకు ఆగస్టు12న స్పాట్ అడ్మిషన్లు ఇవ్వనున్నట్లుగా ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఐలయ్య తెలిపారు. అందుకుగాను ఈనెల 8న మిగిలిన సీట్లు, ఏయో బ్రాంచీలలో ఎన్ని ఉన్నాయో నోటీసు బోర్డులో పెట్టనున్నట్లు తెలిపారు. ఆ రోజే ప్రవేశ పరీక్షలు రాసిన వారు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. 12న ఒర్జినల్ సర్టిఫికెట్లు పాలిటెక్నిక్-2024 ప్రవేశ పరీక్ష ర్యాంకు కార్డు, పదోతరగతి, దానికి సమానమైన విద్యార్హత మార్కుల మెమో, స్టడీ సర్టిఫికెట్, బదిలీ ధ్రువపత్రం, కులం సర్టిఫికెట్, రెసిడెన్షియల్ సర్టిఫికెట్‌లతో పాటు అడ్మిషన్లు పొందే కోర్సుకు సరిపోను ఫీజు వెంట తీసుకొని రావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని ఊట్లపల్లి సబ్‌స్టేషన్‌కు సరఫరా వెళ్లే 33కేవీ లేన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం యాద్గార్‌పల్లితో పాటు ఇండస్ట్రియల్ ఏరియాలోని ఫీడర్ 3 పరిధిలో ఊట్లపల్లి, కాల్వపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో రూరల్ ఏఈ అమర్‌సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పెద్దవూర : ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన మండలంలోని బట్టుగూడెం గ్రామానికి చెందిన మండారి సుధాకర్ కుటుంబ సభ్యులకు గురువారం తన బీఈడీ క్లాస్‌మెట్స్ రూ.1.40 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మృతుడు సుధాకర్ చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని పేర్కొన్నారు. రూ.1.40 లక్షల మొత్తాన్ని సుధాకర్ ఇద్దరు కుమారులకు పోస్ట్ ఆఫీసులో కిసాన్ వికాస్ పత్ర(కేవీపీ) పాలసీ పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, ఎఫ్‌డీ పేపర్లను వారికి అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు సైదులు, డేవిడ్ రాజు, సురేష్, సైదులు, అంజిబాబు, లింగయ్య పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయం డీఏఓగా సాదత్

మిర్యాలగూడ : మిర్యాలగూడ ఆర్డీఓ డివిజనల్ పరిపాలన అధికారిగా మహమ్మద్ సాదత్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని వక్ఫ్‌బోర్డులో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మహమ్మద్ సాదత్ బదిలీపై నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌గా రాగా మిర్యాలగూడ డీఏటగా సాదత్‌ను నియమించారు. గురువారం సాదత్ ఆర్డీఓ శ్రీనివాస్‌రావుకు జాయినింగ్ లెటర్ అందించారు. బాధ్యతలు స్వీకరించిన సాదత్‌ను కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు

నేత్రదానంతో మరొకరికి చూపు



కుటుంబ సభ్యులకు నేత్రదాన పత్రాలు అందజేస్తున్న నేత్ర నిధి ప్రతినిధులు

మిర్యాలగూడ అర్బన్ : నేత్రదానంతో మరొకరికి చూపు వస్తుందని వాసవీ క్లబ్ గవర్నర్ రాచర్ల కమలాకర్ అన్నారు. మిర్యాలగూడ మండలం కొండ్రపోల్ గ్రామానికి చెందిన చెన్నూరు హైమావతి కళ్లను కుటుంబ సభ్యులు దానం చేయడానికి ముందుకు రావడంతో వాసవీక్లబ్ ప్రతినిధులు నేత్రాలను డైమండ్ నేత్ర నిధికి అందజేశారు. ఈ కార్యక్రమంలో హైమావతి కుటుంబ సభ్యులతో పాటు అడ్వకేట్ గూడూరు శ్రీనివాస్ రావు, టెక్నీషియన్ రమేష్ , వంశీ తదితరులున్నారు.

వినియోగదారుల చైతన్య సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 10, 11వ తేదీల్లో సాగర్ హిల్‌కాలనీ విజయవిహార్‌లో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల చైతన్య సదస్సు, వర్క్‌షాపును విజయవంతం చేయాలని క్యాట్కో రాష్ట్ర నాయకులు పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, అన్నబోయిన మట్టయ్య అన్నారు. గురువారం స్థానిక ఖమ్మం రోడ్డులోని కోర్టు ఎదుట క్యాట్కో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వేణుగోపాల్‌రావు, ఎండీ ఇబ్రహీం, శ్రీనివాసాచారి, మహ్మద్ మస్తాన్‌వలి, ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ సభను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 13న హైదరాబాద్‌లో నిర్వహించే ఎమ్మార్పీఎస్ విజయోత్సవ సభను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మచ్చ ఏడుకొండలు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ సంద్ర నాగరాజు, అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకులు, కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టడవి కాదు.. సాగునీటి కాల్వ

- పూడిక, కంపచెట్లతో నిండిపోయిన రాజవరం మేజర్‌కాల్వ
- చివరి భూములకు సాగునీరు చేరేది కష్టమే అంటున్న రైతులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : నాగార్జునసాగర్ ఎడమకాల్వ మొదటి మేజర్ రాజవరం మేజర్ కాల్వ కంపచెట్లు, పూడికతో నిండిపోయింది. కాలువనిండా కంపచెట్లు దట్టంగా పెరగడంతో చివరి వరకు సరిపడా సాగునీరు వెళ్లడం లేదు. ప్రస్తుతం రైతులు నార్లు పోసుకోవడానికి సిద్ధపడటంతో నీరు చివరి వరకు సరిసడా చేరుతుందా లేదా అనే అయోమయంలో ఉన్నారు. కాల్వలో కంపచెట్లు తొలగించకుంటే చివరి రైతులకు ఇబ్బందులు తప్పవు. కంపచెట్లను తొలగించాల్సిన లష్కర్లు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కంపచెట్లు, పూడిక ఇలాగే ఉంటే సుమారు 3500ఎకరాలకు సాగునీరు అందడం కష్టమవుతుందని, ఇప్పటికైనా అధికారులు కాల్వలో పూడికతీసి, కంపచెట్లను తొలగించాలని రైతులు కోరుతున్నారు.







కంపచెట్లు, పూడికతో నిండిన రాజవరం మేజర్

భూగర్భజలాల పెంపునకు కృషి చేయాలి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : భూగర్భజలాల పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు మిర్యాలగూడ మండలం చింతలపాలెం గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలను నాటి ఇంకుడుగుంతలను తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో భూగర్భజలాను కాపాడుకోవడానికి ఇంకుడుగుంతలను నిర్మించుకోవడం అంతేముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ తమవంత బాధ్యత ఇంట్లో ఇంకుగుంతలను నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శేషగిరిశర్మ, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దున్నపోతుల గండి పరిశీలన

అడవిదేవులపల్లి : చిట్యాల గ్రామంలోని దున్నపోతుల గండిని గురువారం మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పరిశీలించారు. అనంతరం రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సంబంధిత అధికారులతో ఆయన వివరాలు అడిగి ఈ విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దున్నపోతుల గండికి వస్తున్నారన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో లిఫ్ట్ ఇరిగేషన్లకు నిధులు కేటాయించడం సంతోషకరంగా ఉందన్నారు. ఆయన వెంట మిర్యాలగూడ ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, డీసీసీ అధ్యక్షుతు కేతావత్ శంకర్ నాయక్, తహసీల్దార్ సురేష్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాదిల శ్రీను, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాలునాయక్, ఎస్‌ఐ శేఖర్‌లతో పాటు ఇరిగేషన్ అధికారులు తదితరులున్నారు.



అడవిదేవులపల్లి : అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలి

మిర్యాలగూడ అర్బన్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్యను పెంచాలని స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలోని ఐఎంఏ బిల్డింగ్‌లో మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీ, ఎంపీహెచ్ఎ, ఏఎన్ఎంలు ఇతర వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస సమరథ్, డీటీసీఓ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, మిర్యాలగూడ, దేవరకొండ, నల్లగొండ డిప్యూటీ డీఎంహెచ్ఓ లు గీతావాణి, కేశారవి, వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ వహీద ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

వేములపల్లి : ప్రస్తుత వర్షాకాలంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని డీఎంహెఓ పుట్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీబీ ప్రాజెక్ట్ ఆఫీసర్ కల్యాణ్‌చక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్ఓలు వేణుగోపాల్‌రెడ్డి, గీతావాణి, వైద్యాధికారి డాక్టర్ సుచరిత, సిబ్బంది ఉన్నారు.



మిర్యాలగూడ అర్బన్ : సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్

ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలని ఆందోళన



నాగార్జునసాగర్ : మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

నాగార్జునసాగర్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఎస్సీ డిక్లరేషన్ హామీలను తక్షణమే అమలు చేయాలని గురువారం బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మురాందాస్ ఆధ్వర్యంలో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం నందికొండ మున్సిపాలిటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గణేష్, తంగరాజు, వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

వేములపల్లి (మాడుగులపల్లి): కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ప్రకటించిన విధంగా ఎస్సీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎడ్ల రమేష్ అన్నారు. గురువారం మాడుగులపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దాసరి నాగరాజు, నరసింహ, యాదిరి, జాన్‌రెడ్డి, నాగరాజు, గిరి పాల్గొన్నారు.

చింతపల్లి : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఎస్సీ డిక్లరేషన్‌లో పొందుపర్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు శివర్ల రమేష్‌యాదవ్ కోరారు. గురువారం డిప్యూటీ తహసీల్దార్ అర్షద్‌కు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్సీ మోర్చా అధ్యక్షులు ఏర్పుల యాదగిరి, జంగయ్య, శేఖర్, మాసని సైదులు, శ్రీశైలం, అభినవ్ తదితరులున్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు.గురువారం దేవరకొండ మున్సిపాల్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాల్టీ పరిధిలోని అన్ని వార్డుల్లో స్వయం సహాయక సంఘాలతో సమావేశాలు నిర్వహించి అందరిని భాగస్వాములను చేయాలని అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత,సీజనల్ వ్యాధులు,ప్లాస్టిక్ వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.పట్టణంలో వన మహోత్సవంలో భాగంగా విరివిగా మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన మున్సిపల్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ్మ,కమీషనర్ భాస్కర్‌రెడ్డి,నాయకులు మారుపాకుల సురేష్‌గౌడ్,పున్న వెంకటేశ్వర్లు,హన్మంతు వెంకటేష్,వడ్త్య దేవేందర్,శ్రీశైలం యాదవ్, శ్రీనయ్య,కిన్నెర హరికృష్ణ,తదితరులున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

హాలియా : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే రోగాలు రాకుండా ఉండటానికి అవకాశం ఉంటుందని జిల్లా అడిషనల్ కలెక్టర్ పూర్ణచంద్ర అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా గురువారం హాలియా మున్సిపాలిటీలో నిర్వహించిన పలు కార్యక్రమాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. అనంతరం స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే బాలికల హైస్కూల్‌ను అడిషనల్ కలెక్టర్ సందర్శించి విద్యార్థులకు డెంగీ మలేరియా వ్యాధుల నివారణ, వీధి కుక్కల బెడదపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత శుభ్రత ఉంటే 90 శాతం వ్యాధులను అరికట్టవచ్చునని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ, మేనేజర్ అబ్దుల్ రషీద్, టీఎంసీజీ వసంతకుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రవికుమార్, వార్డు ఆఫీసర్ అనుష, అంగన్‌వాడీ టీచర్, ఆర్‌పీలు, ఆశ వర్కర్లు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

పెద్దవూర : చదువుకు పేదరికం అడ్డుకాదని, ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలగా నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం రూ.10లక్షల నిధులను కేటాయించినట్లు తెలిపారు. పాఠశాలను రోల్ మోడల్‌లో భాగంగా లైబ్రరీ, కిచెన్‌షెడ్, ప్యూరిఫైడ్ వాటర్, కంప్యూటర్లు, స్పోర్ట్స్ కిట్, ప్రహరిలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధికి మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీటీడీఓ, మండల ప్రత్యేక అధికారి రాజ్‌కుమార్, ఎంపీడీఓ ఉమాదేవి, హెచ్ఎం తరి రాము పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం ఒక ఉద్యమం లాంటిదని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. గురువారం పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బకల్‌వాడీ జిల్లా పరిషత్, నందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత, హనుమాన్‌పేట ప్రభుత్వ పాఠశాలలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చిలుకూరి రమాదేవిశ్యాం, హనుమాన్‌పేట పాఠశాల హెచ్ఎం బాలు, బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయకుమారి, బకల్‌వాడీ పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం మాధవి, నందిపాడు పాఠశాల హెచ్ఎం గణేష్, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు టీపీఎస్ సైదులు సీటీ శ్రీనివాస్ తదితరులున్నారు.

ఈదులగూడెంలో..

పట్టణంలోని 4. 5వ వార్డు ఈదులగూడెంలో స్థానిక కౌన్సిలర్లు చల్లా నాగమ్మవెంకన్న, ముదిరెడ్డి నర్సిరెడ్డి వార్డులో గురువారం పర్యటిస్తూ ఇంటింటికి వెళ్లి స్వచ్ఛదనం, పచ్చదనంపై అవగాహన కల్పిస్తున్నారు. వారి వెంట అంగన్‌వాడీ టీచర్లు బొందు పార్వతి, రామాంజమ్మ, లలితమ్మ, అశా వర్కర్లు రజిత, నవ్య, వార్డు ఆఫీసర్ సైదులు, మున్సిపల్ జవాన్ భిక్షం తదితరులున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గుర్రంపోడు : సీజనల్ వ్యాధులకు గురికాకుండా ప్రతి ఒక్కరూ తమ ఇంటితోపాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ మంజుల అన్నారు. గురువారం మండలకేంద్రంలో పీహెచ్‌సీలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించి పిచ్చిమొక్కలు తొలగించారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి భవానీ చక్రవర్తి, ఐకేపీ ఏపీఎం యాదయ్య, ఆశావర్కర్లు , గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ కరుణాకర్, డీఎల్‌పీఓ రాఘవారావు అన్నారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని మొల్కచర్ల, బంగారికుంటతండ, బాల్నేపల్లి గ్రామాల్లో మొక్కలను నాటి పరిసరాల పరిశీలించారు. అనంతరం అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగుల వివరాలతో పాటు ఓపీ తదితర వాటిని పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మోసిన్‌బిన్ అహ్మద్, మెడికల్ ఆఫీసర్ రామాంజనేయులు, ఏపీఓ సూర్యనాయక్‌లతో పాటు పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.



దేవరకొండ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే



పెద్దవూరలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి



మిర్యాలగూడ టౌన్ : మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ యూసుఫ్

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి : జూలకంటి

మిర్యాలగూడ: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని, పంట పెట్టుబడి కోసం రైతుభరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని, వ్యవసాయ సాగులో రైతులకు సలహాలు, సూచనలు చేయాలని అన్నారు. అదే విధంగా మార్కెట్‌లో నకిలీ విత్తనాలు, పురుగు మందులు వస్తున్నా వాటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వరదకాల్వ ద్వారా మిర్యాలగూడ నియోజకవర్గంలోని చెరువులన్నింటినీ నింపాలన్నారు. అనంతరం పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం పోలిట్‌బ్యూరో సభ్యుడు బుద్దదేవ్ భట్టాచార్య అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యం పదిలం

వేములపల్లి : తల్లి పాలతో బిడ్డ ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిని అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని మొల్కపట్నం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ అనూష, అంగన్‌వాడి టీచర్లు రజిత, యాదమ్మ, శ్రీధర్‌రెడ్డి, కవిత, దేవమణి పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : మండలంలోని చింతకుంట్ల గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీడీపీఓ సరళ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కృష్ణ, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు, అంగన్‌వాడి టీచర్లు భారతమ్మ, అంజలి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

పెద్దవూర : తను చదువుకున్న పాఠశాల రోల్ మోడల్ స్కూలుగా ఎంపికకావడం హర్షణీయమని, పాఠశాల అభివృద్ధికి ఎల్లవేళలా తనవంతు కృషి చేస్తానని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఎందరినో దాతలను ఒప్పించి మౌలిక వసతులు కల్పించిన స్థల దాత లింగారెడ్డిని ఉపాధ్యాయులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజ్‌కుమార్, పాఠశాల హెచ్ఎం తరి రాము, ఉపాధ్యాయులు రమాదేవి, రూపారెడ్డి, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.



లింగారెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

పెద్దవూర : అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా ప్రజా సమస్యలను పరిష్కారించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ విమర్శించారు. గురువారం మండలంలోని పూల్యాతండా సమీపంలో ఏఎమ్మార్పీ లో లెవల్ వరద కాలువపై డీ-8, 9 కాలువపై ఏర్పాటు చేసిన ఎత్తిపోతలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం ప్రారంభమై మధలో ఆగిపోయిన వరద కాలువ పనులను మాజీ ఎమ్మెల్యేలు రామ్మూర్తియాదవ్, నోముల నర్సింహయ్యలు మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి విన్నవించి పనులను పూర్తి చేయించారన్నారు. వరద కాలువ పరిధిలోని ఏఎమ్మార్పీ డీ-8, 9 కాలువ కింద 8వేల ఎకరాలకు సాగు నీరు అందించాలన్న ఉద్దేశ్యంతో పూల్యాతండా వద్ద లిఫ్టును ఏర్పాటు చేసి రెండున్నరేళ్లలో 98శాతం పనులు పూర్తి చేశామన్నారు. వరద కాలువకు గండిపడిన ప్రదేశంలో ఒక్క రాత్రిలో పూర్తి చేసే పనికి జంగిల్ కటింగ్ పేరుతో నాలుగు రోజులైనా పూర్తి చేయకపోవడం దారుణమన్నారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి విదేశీ టూర్లకు వెళ్లడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు రవినాయక్, వెంకటేశ్వర్లు, నాయకులు బాలయ్య, రాజేష్‌నాయక్, లక్ష్మణ్, గోపీ, రవి, ముత్యాలు, సతీష్‌రెడ్డి, శ్రీదేవి, చిరంజీవి, స్వామి, వెంకటయ్య, పాల్గొన్నారు.



నిలిచిన కాల్వ పనులను పరిశీలిస్తున్న సాగర్ మాజీ ఎమ్మెల్యే భగత్

టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశం

గుర్రంపోడు : మండలంలో పలు పాఠశాలల్లో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వాన్ని గురువారం ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు విడతల కరువు భత్యాన్ని తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ కన్వీనర్ శ్యామ్‌కుమార్, మండల అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి సైదులు, మండల కార్యవర్గ సభ్యుడు మహేశ్వరం సురేష్ పాల్గొన్నారు.

హనుమంతరావుకు పరామర్శ

నిడమనూరు : మాజీ ఎంపీపీ చేకూరి హన్మంతరావును ఏపీలోని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు గురువారం సాయంత్రం పరామర్శించారు. చేకూరి హన్మంతరావు గొన్ని రోజుల క్రితం అనారోగ్యానికి గురై కోలుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన గురువారం మండలంలోని శాఖపురంలో కలిసి ఆయనను పరామర్శించారు. ఆయన వెంట కేటేశ్వరరావు, శ్రీదర్, కోలా శ్యామ్, వంశీ తదితరులున్నారు.

శ్రీహర్షకు నివాళి

మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన విరిగినేని శ్రీహర్ష చిత్ర పటానికి పూలమాల వేసి గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం నివాళులర్పించారు. డీసీసీబీ డైరెక్టర్ విరిగినేని అంజయ్య కుమారుడు విరిగినేని శ్రీహర్ష ఇటీవల గెండెపోటుతో మృతి చెందగా గురువారం పెద్దకర్మ నిర్వహించారు. అంజయ్యను, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

దేవరకొండ : జనగాం జిల్లాలో న్యాయవాదులు అమృతరావు, కవితలపై పోలీసులు దాడి చేయడం అమానుషమని దేవరకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల ఆంజనేయులు అన్నారు. గురువారం న్యాయవాదులు తమ విధులు బహిష్కరించి కోర్టు బయట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడికి నిరసనగా రెండు రోజుల పాటు విధులు బహిష్కరించి నిరసన తెలపనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రమాశంకర్, ఉప్పల రమేశ్, ఉమామహేశ్వర్, రవి, జగదీష్, శ్రీకాంత్, పుష్పలత, రియాజ్, ఇద్దయ్య, వెంకటేశ్వర్లు, గణేష్, యాదయ్య, ఆంజనేయులు, సాయి, సురేష్ ఉన్నారు.

న్యాయవాదుల రాస్తారోకో

మిర్యాలగూడ టౌన్ : జనగామ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు న్యాయవాదులు అమృతరావు, కవితలపై దాడికి పాల్పడిన పోలీసులను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కోదాడ-జడ్చర్ల జాతీయ ప్రధాన రహదారిపై న్యాయవాదులు రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సకినాల వేలాద్రి, ఉపాధ్యక్షులు ఇబ్రహీం, పీఎస్ ప్రసాద్, కోశాధికారి ఎంవీ పవన్‌కుమార్, జాయింట్ సెక్రటరీ మల్లేష్, న్యాయవాదులు రవినాయక్, గంగాభవాని, రామకృష్ణ, కె.శ్రీనివాస్‌రెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, వెంకన్న, లింగయ్య, యల్లయ్య, ప్రభాకర్, శ్రీరాములు, మోహన్, సుష్మిత, శ్వేత, చంద్రశేఖర్ రెడ్డి, టి. రామచందర్‌రావు పాల్గొన్నారు.



మిర్యాలగూడ టౌన్ : జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న న్యాయవాదులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ



దేవరకొండ : విరాళాలు సేకరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దేవరకొండ : కేరళ వయనాడ్ వరద బాధితుల కోసం ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బుడిగ వెంకటేష్, లక్ష్మ ణ్‌నాయక్ మాట్లాడుతూ భారీ వర్షాలతో వయనాడ్ ప్రజలు ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి ప్రజలకు బాసటగా నిలిచేందుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. వయనాడ్ ప్రజలకు యావత్ భారత దేశ ప్రజలు అండగా ఉండాల్సిన సమయమిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చరణ్,ఇద్దిరాములు ,రాకేష్,శివ,రాజు, దినేష్, తదితరులున్నారు.

దామరచర్లలో..

మిర్యాలగూడ : కేరళ రాష్ట్రం వయనాడ్ వరద బాధితులకు అండగా నిలిచేందుకు దామరచర్ల మండల ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం మండల కేంద్రంలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి ధీరావత్ వీరన్న నాయక్ మాట్లాడుతూ వరదల్లో సర్వస్వం కోల్పోయిన వయనాడ్ బాధితులకు కేంద్ర ప్రభుత్వం రూ.2వేల కోట్లను కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి, దత్తు, చంటి, గణేష్, సైదా, అమీన్, విఘ్నేష్, అమన్, వంశీ, రాహుల్, జస్వంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.